నారాయణపేట ఎమ్మెల్యే పేరుతో
ఫేక్ లెటర్‌ప్యాడ్
● గురుకుల పాఠశాలలో వాచ్‌మన్ పోస్టు కోసం సృష్టి
● పోలీసుల అదుపులో నిందితులు
7

బోనస్ చెల్లించరేం?

● సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించిన రాష్ట్రం
● ఉమ్మడి జిల్లాలో 3.72 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు
● ధాన్యం డబ్బులు మాత్రమే చెల్లింపు.. ● రూ.111.02 కోట్ల బోనస్ పెండింగ్
● కర్ణాటక వ్యాపారుల కొనుగోళ్లతో భారీగా తగ్గిన ప్రభుత్వ సేకరణ

మహబూబ్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం విక్రయించిన రైతులు బోనస్ కోసం ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి పాలమూరు రూ.111.02 కోట్ల బోనస్ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఏటికేడు వరి సాగు పెరుగుతుండటం, సానుకూల వర్షపాతం నమోదవడంతో దిగుబడులు కూడా భారీగానే వచ్చాయి. అయితే కొనుగోళ్ల సీజన్ ప్రారంభంలో కేంద్రాలు ఆలస్యంగా తెరవడం, పేరుకు కేంద్రాలు ప్రారంభించినా సేకరణ చేపట్టకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. అదే సమయంలో పక్క రాష్ట్రమైన కర్ణాటకతో పాటు స్థానికంగా ఉండే మిల్లర్లు కూడా భారీగా ధాన్యం సేకరించడంతో రైతులకు కొంత ఊరట లభించింది. లక్ష్యం ప్రకారం ఏ జిల్లాల్లోనూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు చేయలేదని చెప్పొచ్చు. దళారులు కూడా రిస్క్ లేకుండా కల్లాల వద్దనే కొనుగోలు చేసి, మంచి ధర ఇవ్వడంతో రైతుల నుంచీ పెద్దగా ఇబ్బందులు తలెత్తలేదు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,017 ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. దొడ్డు రకాలు, సన్నరకాలు రెండూ కలిపి 5.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ఇందులో సన్నరకాలు 3.72 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నాయి. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో దొడ్డు రకం ధాన్యమే ప్రతీ సీజన్‌లో ఎక్కువగా సేకరిస్తారు. అయితే దొడ్డు రకాలు సాగు చేసిన రైతులు ఈసారి ముందస్తుగానే ఇతర వ్యాపారులకు అప్పగించారు. ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్ ఇవ్వని మెజారిటీ మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేయకపోవడంతో.. మిల్లు నడవడం కోసం పలువురు మిల్లర్లు రైతుల వద్ద నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.


మహబూబ్‌నగర్ జిల్లా కోటకదిర వద్ద ధాన్యం తూకం చేస్తున్న వ్యాపారులు (ఫైల్)

బోనస్‌తోనే సన్నాలు అధికం..
కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు
(మిగతా 6లో..)

జిల్లాల వారీగా కొనుగోళ్లు

జిల్లా	కొనుగోలు కేంద్రాలు	సేకరించిన ధాన్యం(టన్నుల్లో)	సన్నధాన్యం (టన్నుల్లో)
వనపర్తి	414	2,25,000	1,35,000
నారాయణపేట	102	89,928	71,744
గద్వాల	70	67,220	67,070
మహబూబ్‌నగర్	177	92,000	62,465
నాగర్‌కర్నూల్	254	99,841	35,949

సన్నాల బోనస్ పెండింగ్ (రూ.కోట్లలో..)

జిల్లా	మొత్తం	పెండింగ్
నాగర్‌కర్నూల్	32	21.30
మహబూబ్‌నగర్	31.23	10.15
గద్వాల	33	26.00
నారాయణపేట	35.87	14.19
వనపర్తి	67.58	39.38


మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్యాలయం

డివిజన్‌లు ఎక్కువ.. ఓట్లు తక్కువ

● పాలమూరు పురపాలికలో ప్రస్తుతం 49 వార్డులు
● కార్పొరేషన్‌గా మారనుండటంతో 60కి పెరగనున్న డివిజన్లు
● ఫలితంగా తగ్గనున్న ఓటర్ల సంఖ్య
● ఆందోళనలో మాజీ కౌన్సిలర్లు, కార్పొరేటర్ పోటీ ఆశావహులు
● ఏ వార్డు ఎటు కలుస్తుందోనని టెన్షన్
● డివిజన్‌గా మారనున్న దివిటిపల్లి

మహబూబ్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పాలమూరు పురపాలిక కార్పొరేషన్ అవుతున్న నేపథ్యంలో ఊహించిన దానికన్నా ఎక్కువ డివిజన్లు ఏర్పాటవుతుండగా, ఆయా డివిజన్లలో ఓటర్లు తగ్గిపోనున్నారు. కేవలం రెండు గ్రామాలను మాత్రమే విలీనం చేసి, కార్పొరేషన్‌గా చేయడంతో ప్రస్తుతం ఉన్న వార్డులకు రెండు లేదా మూడు మాత్రమే పెరుగుతాయని అంతా భావించారు. అదే జరిగితే ప్రస్తుతం ఉన్న వార్డుల నుంచి 100 నుంచి 200 ఓట్లు కలవడమో లేదా పోవడమో అవుతుందని తాజామాజీ కౌన్సిలర్లతో పాటు ఆశావహులు లెక్కలేసుకున్నారు. కానీ సీడీఎంఏ విడుదల చేసిన జీవోలో 60 డివిజన్‌లు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో నాయకులంతా కంగుతిన్నారు. ప్రస్తుతం ఉన్న వార్డులకు 11 వార్డులు పెరుగుతుండటంతో వార్డుల స్వరూపం చాలావరకు మారిపోనుంది. విభజన ప్రక్రియలో కొన్ని వార్డులే గల్లంతయ్యే అవకాశం లేకపోలేదు. కార్పొరేషన్‌గా మారడంతో కౌన్సిలర్ స్థాయి కార్పొరేటర్‌గా మారనుంది. ఓవైపు హోదా పెరుగుతున్నా.. పోటీచేసే వార్డులలో ఓటర్ల సంఖ్య తగ్గనుండటంతో చాలామంది ఆశావహులు, తాజామాజీ కౌన్సిలర్‌లకు ఇది రుచించడం లేదు. హోదాకు తగ్గట్టు ప్రస్తుతం ఉన్న ఓటర్ల సంఖ్య పెరగాల్సిన చోట తగ్గనుండటంపై పెదవి విరుస్తున్నారు. 60 డివిజన్‌లు అవుతుండటంతో ఆయా వార్డులలో ఇదివరకు ఉన్న ఓటర్ల సంఖ్య కన్నా 500 నుంచి 800 ఓట్లు తగ్గిపోనున్నాయి. ప్రస్తుతం కొన్ని వార్డులలో 3,700 నుంచి 3,900 వరకు ఓటర్లు ఉన్నారు. ఇకపై ఈ
(మిగతా 6లో..)


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన స్కూటీ

ఆర్టీసీ బస్సును ఢీకొన్న స్కూటీ
● యువకుడి మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
● ముందు వెళ్తున్న బస్సును ఓవర్‌టేక్ చేస్తుండగా ఘటన
● ఊట్కూర్‌లో ప్రమాదం
7

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం
● కృష్ణానదిలో స్నానం చేయడానికి వెళ్లి నీటిలో మునిగిపోయినట్లు అనుమానం
7

నిబంధనలు పాటించకే ప్రమాదాలు
● కలెక్టర్ విజయేందిర బోయి
● రహదారి భద్రతపై పోలీసుల బైక్ ర్యాలీ

మహబూబ్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నిర్లక్ష్యంగా నడపడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. వాహనదారులంతా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని గడియారం చౌరస్తాలో కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకి, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి ఇందిర జెండా ఊపి, బైక్ ర్యాలీ ప్రారంభించారు. అంతకుముందు ట్రాఫిక్ నిబంధనలపై పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలు పాటిస్తే చాలావరకు ప్రమాదాలు తగ్గుతాయని చెప్పారు. న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అధికారులు, ప్రజలు కలిసి పని చేయాలన్నారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ యువతకు వాహన నిబంధనలపై అవగాహన కల్పించేందుకు బైక్ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, అదనపు ఎస్పీ ఏ.రాములు, ట్రాన్స్‌పోర్టు జాయింట్ కమిషనర్ కిషన్, వర్టికల్ డీఎస్పీ సుదర్శన్, సీఐలు అప్పయ్య, భగవంత్‌రెడ్డి, శ్రీనివాస్, ఎంవీఐలు వాసు, రఘుకుమార్ పాల్గొన్నారు.


బైక్ ర్యాలీ చేస్తున్న పోలీసులు


నారాయణపేటలోని మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లు పూర్తి
● వచ్చే నెల మూడు నుంచి 22 వరకు పరీక్షలు
● నారాయణపేట జిల్లాలో 18 కేంద్రాల ఏర్పాటు
● సీసీ కెమెరాల నిఘా నీడలో నిర్వహణ
● హాజరుకానున్న 2,359 మంది విద్యార్థులు

నారాయణపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశారు. వచ్చే నెల మూడో తేదీ నుంచి 22 వరకు ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 38 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అందులో ఎనిమిది ప్రభుత్వ, ఎనిమిది ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, ఎనిమిది కస్తూర్బాలు, రెండు మోడల్, ఒకటి ట్రైబల్, ఆరు సాంఘిక సంక్షేమ గురుకులాలు, ఎనిమిది బీసీ, 10 ఒకేషనల్ కోర్సు కళాశాలలు ఉన్నాయి. ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,359 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. సైన్స్ కోర్సులకు సంబంధించి కెమిస్ట్రీ, ఫిజిక్స్, బాటనీ, జువాలజీ, ఒకేషనల్ కోర్సుకు సంబంధించి పరీక్షలు, కంప్యూటర్ సైన్స్, ఇన్సూరెన్స్, మేనేజ్‌మెంట్, ఎంపీహెచ్‌ఎస్, ఎంఎల్‌టీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి



జిల్లా వ్యాప్తంగా 18 కేంద్రాల్లో ఇం టర్ ప్రాక్టికల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఫిబ్రవరి మూడో తేదీ నుంచి 22 వరకు పరీక్షలు జరుగుతాయి. సీసీ కెమెరాల నిఘాలో రాష్ట్ర అధికారుల పర్యవేక్షణలో పరీక్షలు ఉంటాయి. మార్చి ఐదు నుంచి 22 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు ఉంటాయి.
- సుదర్శన్ రావు, ఇన్‌చార్జి డీఐఈవో, నారాయణపేట


గిరి ప్రదక్షిణకు వెళ్లే ముందు ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న పూజలు

కురుమూర్తికి పోటెత్తిన భక్తులు
● అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు
● వైభవంగా గిరి ప్రదక్షిణ

చిన్నచింతకుంట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలో వెలిసిన కురుమూర్తి వేంకటేశ్వర స్వామి ఆలయానికి అమావాస్య సందర్భంగా బుధవారం భక్తులు పోటెత్తారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు తరలొచ్చారు. దాంతో స్వామి గిరులు భక్తులతో కిటకిటలాడాయి. జాతర మైదానంలోనూ భక్తులు పెద్ద ఎత్తున దాసంగాలు పెట్టారు. వీహెచ్‌పీ ఆ.ధ్వర్యంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. పార్టీలకు అతీతంగా హిందూ ధార్మిక సంస్థలతో పాటు భక్తులు వందలాదిగా గిరిప్రదక్షిణాలో పాల్గొన్నారు. స్వామి రాజగోపురం నుంచి ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, పాలకరవ ర్గం సభ్యులు బాస్కరాచారీ, వీహెచ్‌పీ నాయకులు సి.శివయ్య, నాయకులు నం బిరాజు, కుర్వరమేష్, శ్రీకృష్ణ, మంగా శ్రీ నువాసులు గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావటంతో ఇకపై ప్రతీ అమావాస్య, పౌర్ణమి రోజు కూడా గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కొండలు గోవింద నినాదాలతో మారుమోగాయి. జాతర మైదానంలో దుకాణాలు వెలి యడంతో జాతరను తలపించింది.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్


జేపీఎన్‌సీఈ కళాశాల కేంద్రంలో పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జయప్రకాశ్ నారాయణ్ ఇంజనీరింగ్ కళాశాల, పాతిమా విద్యాలయాల్లో బుధవారం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు మొత్తం 633 మంది హాజరు కావాల్సి ఉండగా, తొమ్మిది మంది గైర్హాజరు అయ్యారు. జేపీఎన్‌సీఈ కళాశాల కేంద్రంలో 363 మందికిగాను 358 మంది హాజరు కాగా, ఐదుగురు హాజరు కాలేదు. ఉదయం, మధ్యాహ్నం పరీక్ష నిర్వహించారు. కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

మాట మార్చిన వ్యాపారులు
● మళ్లీ ఆందోళన చేపట్టిన రైతులు
● ధరపై రూ.200 అదనంగా ఇస్తే తమపై భారం పడుతుందని వెల్లడి
● సుదీర్ఘ చర్చల అనంతరం అంగీకారం
6


జడ్చర్లలో నిర్వహించిన ర్యాలీలో డప్పు కొడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

రేవంత్‌రెడ్డి సర్కార్ కూలుతుంది
● వర్గీకరణ చేపట్టకపోతే జరిగేది అదే..
● మాలలను పెంచి పోషిస్తున్నది కాంగ్రెస్సే
● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ
6

బోనస్ చెల్లించరేం?



మన్యంకొండ వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యం(ఫైల్)

(5వ పేజీ తరువాయి)

ముందు ధాన్యానికి బోనస్ ప్రకటిస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత సన్నరకాలకు క్వింటాల్‌పై రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దీంతో రైతులు కూడా ఈసారి సన్న రకాలను ఎక్కువగా సాగు చేశారు. దొడ్డు రకాలను ఎక్కువగా కర్ణాటక వ్యాపారులకు లేదా స్థానిక మిల్లర్లకు విక్రయించిన రైతులు.. సన్నరకాలను మాత్రం అధికంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. ఇందుకు కారణం కేవలం ప్రభుత్వం ప్రకటించిన బోనసేనని చెప్పొచ్చు. అన్ని జిల్లాల్లోనూ సన్నాలే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సేకరించినట్లు అధికారిక గణంకాలే చెబుతున్నాయి. అయితే ఇప్పటివరకు అన్ని జిల్లాల్లో ధాన్యం సేకరణ దాదాపు పూర్తయ్యింది. వనపర్తి జిల్లాలో రూ.10 కోట్లు మినహా ధాన్యం ఎంఎస్‌పీ ప్రకారం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. కానీ బోనస్ డబ్బులు మాత్రం ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ధాన్యం డబ్బులు సపరేట్‌గా.. బోనస్ డబ్బులు సపరేట్‌గా వేస్తుండటం వల్ల రైతులు బోనస్ కోసం ఎదురు చూస్తున్నారు. సీజన్ ఆరంభంలో ధాన్యం విక్రయించినా.. రైతులకు బోనస్ పడకపోవడం గమనార్హం.

రూ. 111.02 కోట్లు పెండింగ్..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 3.72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించగా.. క్వింటాల్‌కు రూ.500 చొప్పున రూ. 199 కోట్ల వరకు బోనస్ చెల్లించాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు రూ.88 కోట్ల మేర బోనస్ మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.111.02 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారిక గణంకాలు చెబుతున్నాయి. ఇప్పటికే రైతు భరోసా గత సీజన్‌లో మొత్తమే రాలేదు. ఈ యాసంగి సీజన్‌లో పథకం ప్రారంభించినప్పటికీ, మండలానికి ఒక్క గ్రామంలో మాత్రమే రైతులకు పెట్టుబడి సాయం ఖాతాల్లో పడింది. సీఎం రేవంత్‌రెడ్డి మార్చి 31 వరకు ఇది నిరంతర ప్రక్రియ అని ప్రారంభ సభలో తెలిపారు. ఇంకా జాబితాలనే అధికారులు ఫైనల్ చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో గందరగోళ పరిస్థితి నెలకొంది. అదే సమయంలో ఈ బోనస్ డబ్బులు కూడా విడుదల కాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే బోనస్ డబ్బులు, రైతు భరోసా సాయం విడుదల చేయాలని కోరుతున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో అత్యధికంగా రూ.39.39 కోట్ల బోనస్ పెండింగ్‌లో ఉండగా.. మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.10.15 కోట్లు పెండింగ్‌లో ఉంది.



దివిటిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

డివిజన్‌లు ఎక్కువ.. ఓట్లు తక్కువ

(5వ పేజీ తరువాయి)

సంఖ్య 3,000 నుంచి 3,300కు మించి ఉండే అవకాశం ఉండదు. ఓటర్ల సంఖ్య తగ్గడం వల్ల ప్రతీ ఓటు విలువైనదిగా మారనుంది. కార్పొరేటర్ అంటే తమ డివిజన్ పరిధి కనీసం ఐదు వేల మంది ఓటర్లు ఉండాలని పలువురు కోరుతున్నారు. డివిజన్ చిన్నదిగా మారనుండటంతో సర్పంచ్ తరహాలో హోరాహోరీగా ఎన్నిక జరగనుంది.

ప్రత్యేక డివిజన్‌గా దివిటిపల్లి

దివిటిపల్లి గ్రామ పంచాయతీ ప్రత్యేక డివిజన్‌గా మారే అవకాశం ఉంది. అక్కడ ప్రస్తుతం 2,400 మంది ఓటర్లు ఉన్నారు. అయితే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలోకి కొత్తగా వచ్చిన వారు దివిటిపల్లిలో ఓటర్లుగా నమోదు చేయించుకుంటే ఒక డివిజన్ ఏర్పాటు కానుంది. దివిటిపల్లిలో రాజకీయం ఎక్కువ. అక్కడే ఐటీపార్క్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం ఉండటంతో సర్పంచ్‌గా పోటీ చేసేందుకు చాలామంది పోటీ చేయాలని భావించారు. ఇప్పుడు సర్పంచ్‌లకు అవకాశం లేకపోవడంతో కార్పొరేటర్ పోటీకి సిద్ధమవుతున్నారు. 2012లో 10 గ్రామాలను మునిసిపాలిటీలో విలీనం చేసి వార్డులను 41 నుంచి 49కి పెంచారు. అదే సమయంలో విడిగా ఉన్న దివిటిపల్లిని కూడా మునిసిపాలిటీలో కలపాలని నిర్ణయించినా, అప్పట్లో గ్రామస్థుల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. దాంతో కలుపలేదు. ఇప్పుడు కార్పొరేషన్‌లో విలీనం కాక తప్పడం లేదు. ఇక జైనల్లీపూర్‌లో ఓటర్ల సంఖ్య తక్కువగా ఉండటంతో బోయపల్లి పార్క్, జైనల్లీపూర్‌ను కలిపి డివిజన్‌గా ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి.

రేవంత్‌రెడ్డి సర్కార్ కూలుతుంది

- వర్గీకరణ చేపట్టకపోతే జరిగేది అదే
- మాలలను పెంచి పోషిస్తున్నది కాంగ్రెస్సే
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



జడ్చర్లలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

జడ్చర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ జరగకపోతే రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ కూలిపోతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామంటున్న మాలలను పెంచి పోషిస్తున్నది కాంగ్రెస్ పార్టీనే అని ఆరోపించారు. ఫిబ్రవరి ఏడున హైదరాబాద్‌లో 'వేల గొంతులు - లక్షల డప్పులు' మహా ప్రదర్శన నిర్వహించనున్నారు. అందుకోసం మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని చంద్రాగార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన సన్నాహక సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల కన్నా ముందుగా తెలంగాణలోనే ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణకు అండగా ఉండడంతో పాటు, వర్గీకరణను అమలు చేస్తామని ఆయన శాసనసభలో ప్రకటించడంతో సీఎం రేవంత్‌రెడ్డిని విశ్వసించామన్నారు. కానీ అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వర్గీకరణ అమలు కాకముందే 11 వేల టీచరు పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. వర్గీకరణ అమలు చేయడంలో జాప్యంతో పాటు, మాట నిలబెట్టుకోక పోవడంతో ఫిబ్రవరి ఏడున వేల గొంతులు - లక్ష డప్పులు కార్యక్రమం చేపడ్తున్నట్లు వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలమని చెప్పానే, మేనిఫెస్టోలో పొందుపరిచిన ఎస్సీ వర్గీకరణను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందని ప్రశ్నించారు. అన్ని పార్టీల్లో మాదిగలతో పాటు మాలలు ఉన్నారని, కేవలం కాంగ్రెస్ పార్టీలోని మాలలు వర్గీకరణను అడ్డుకుంటామంటుంటే ఎందుకు మౌనంగా ఉన్నారంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రశ్నించారు. వర్గీకరణ ఎలా జరుగుతుందో చూస్తామంటూ మీసం మెలేస్తున్నారని, తొడలు కొడుతున్నారని, తొక్కుకుంటూ వెళ్తామంటూ ప్రకటనలు చేస్తున్నారన్నారు. అవసరమైతే మందకృష్ణ మాదిగను చంపుతామంటూ మాలలు బెదిరిస్తున్నారంటే, శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు కుట్రపన్నుతున్నారన్న అనుమానం కలుగుతోందన్నారు. అంతకుముందు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి చంద్రాగార్డెన్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ డప్పు కొట్టి కార్యకర్తలు, నాయకులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జంగయ్యమాదిగ, కరాటేశ్రీను, దగ్గుల బాలరాజు, డప్పుస్వామి, శేఖర్, వినోద్, నాగరాజు, యాదయ్య, రాజు, కృష్ణయ్య, శశికిరణ్, సురేశ్, శాంతయ్య, బీఆర్‌ఎస్ నాయకులు కోడ్గల్ యాదయ్య, పాలాది రాంమోహన్, ఎంఈఎఫ్ నాయకులు యాదయ్య, కృష్ణ పాల్గొన్నారు.

లక్ష డప్పులతో రాజధాని దద్దరిల్లాలి

నారాయణపేట/మరికల్ (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి ఏడున జరుగనున్న వేల గొంతులు, లక్షల డప్పులతో హైదరాబాద్ రాజధాని దద్దరిల్లాలని.. ఇది మన పిల్లల భవిష్యత్ కోసమే ఈ పోరాటం అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. బుధవారం రాత్రి నారాయణపేటలో ఏ,బీ,సీ,డీ వర్గీకరణ సన్నాహక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి డప్పులతో ర్యాలీగా మెట్రో ఫంక్షన్ హాల్‌కు చేరుకొని సభను ఉద్దేశించి మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పుతో కాస్తా ఊరట లభించిందన్నారు. 30 ఏళ్లుగా పోరాడుతున్న వర్గీకరణ సమస్య తుది దశలో ఉందని, అది సాధించుకునేందుకు ఏడో తేదీన హైదరాబాద్ మహాసభకు డప్పులతో తరలిరావాలన్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం మందకృష్ణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఇందిర, గుడిసె వెంకటయ్య, దండు అయ్యప్ప, శంకర్, మహేష్, రాజు తదితరులున్నారు. అంతకుముందు మరికల్‌లో మందకృష్ణ మాదిగకు సమితి నాయకులు పూలమాలతో ఘన స్వాగతం పలికారు. ఇందిరాగాంధీ చౌరస్తాలో మందకృష్ణ మాదిగ కొద్దిసేపు డప్పు వాయించారు.

భారీ కొండచిలువ పట్టివేత



వలలో ఉన్న కొండ చిలువను పట్టుకుంటున్న కృష్ణసాగర్, గ్రామస్థులు

వనపర్తి రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, వనపర్తి మండల పరిధిలోని కాశీంనగర్ గ్రామం ఎర్రగట్టు తండా సమీపంలో భారీ కొండ చిలువ పట్టుబడింది. గ్రామానికి చెందిన నరసింహ తన పొలంలో వేరుశనగ పాట్టు వామికు రక్షణగా వల ఏర్పాటు చేశాడు. గ్రామానికి చెందిన దేశలక్ష్మి అనే మహిళ అటుగా వెళ్తుండగా ఆ వలలో పెద్ద కొండ

11 ఫీట్ల పొడవు, 18 కేజీల బరువు

చిలువ చిక్కుకుని ఉండటం గమనించింది. దీంతో భయపడిన ఆమె పెద్దగా కేకలు వేయడంతో సమీప పొలాల్లో పని చేస్తున్న రైతులు అక్కడికి చేరుకున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ రాములుకు సమాచారం అందించారు. అతడు స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు సమాచారం అందించారు. అతడు వెంటనే ఎర్రగుట్ట తండాకు చేరుకుని వలలో చిక్కుకున్న కొండచిలువను బయటకు తీశాడు. ఈ పాము 11 ఫీట్ల పొడవు, 18 కిలోల బరువు ఉందని తెలిపారు. ఇంత పెద్ద కొండచిలువలు చాలా అరుదన్నారు. పామును అటవీ ప్రాంతంలో వదిలేస్తామని చెప్పారు. అనంతరం దానిని అటవీ ప్రాంతంలో వదిలేశారు. కార్యక్రమంలో సాగర్ స్నేక్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

మాటమార్చిన వ్యాపారులు

- మళ్లీ ఆందోళన చేపట్టిన రైతులు
- ధరపై రూ.200 అదనంగా ఇస్తే తమపై భారం పడుతుందని వెల్లడి
- వ్యాపారులతో అధికారుల చర్చలు
- రూ.3,500 నుంచి రూ.4,500 రేటు వచ్చిన సరుకుకే రూ.200 అదనం ఇచ్చేందుకు అంగీకారం

పాలమూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారులు మాట మార్చడంతో పాలమూరులో వేరుశనగ రైతులు బుధవారం మరోసారి ఆందోళనబాట పట్టారు. మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 8,192 క్వింటాళ్ల వేరుశనగ వచ్చింది. వ్యాపారులు క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.6,190, కనిష్ఠంగా రూ.5489, మాడల్‌గా రూ.3509 ధర పలికింది. కానీ గిట్టుబాటు ధర కావాలని రైతులు ఆందోళన చేశారు. దాంతో రూ.200 అదనంగా ఇస్తామని వ్యాపారులు అంగీకరించారు. ఈ నేపథ్యంలో తెల్లవారుజామున నాలుగున్నరకు తూకం చేస్తామని వ్యాపారులు చెప్పడంతో బుధవారం ఉదయం ఐదు గంటలకే మార్కెట్ కమిటీ చైర్మన్ మార్కెట్‌కు వచ్చారు. అయితే రైతులకు రూ.200 అదనంగా ఇస్తే తమపై రూ.40 లక్షల వరకు భారం పడుతుందని, అది మాకు సమ్మతం కాదని వ్యాపారులు చెప్పడంతో సమస్య మొదటికి వచ్చింది. దాంతో రైతులు మరో మారు ఆందోళనకు దిగారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, ఆర్‌డీవో, జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి, ఉన్నత శ్రేణి కార్యదర్శి భాస్కర్, పోలీసు అధికారుల సమక్షంలో వ్యాపారులతో సుదీర్ఘంగా చర్చలు చేపట్టారు. మధ్యాహ్నం 3:30 గంటల వరకు చర్చలు కొనసాగాయి. జిల్లా, రాష్ట్ర అధికారులతో అధికారులు ఫోన్‌లో మాట్లాడారు. వ్యాపారులతోనూ మాట్లాడించారు. చివరకు క్వింటాల్ రూ.3,500 నుంచి రూ.4,500 వరకు ధర పలికిన వేరుశనగకు రూ.200 అదనంగా ఇచ్చేలా వ్యాపారులను ఒప్పించగలిగారు. ఆ తర్వాత వేరుశనగ కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.

30న మార్కెట్‌కు సెలవు

మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 27,035 బస్తాల వేరుశనగ వచ్చింది. ఆ సరుకు లిఫ్టింగ్ కాకపోవటంతో 30వ తేదీన మార్కెట్‌కు వచ్చే వేరుశనగకు స్థలం లేదు. దీంతో మార్కెట్‌కు గురువారం సెలవు ప్రకటిస్తున్నట్లు కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31వ తేదీ నుంచి క్రయ విక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

నాగర్‌కర్నూల్‌లో యానిమల్ బర్త్ కేర్ సెంటర్

నాగర్‌కర్నూల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పట్టణప్రగతి నిధుల ద్వారా నాగర్ కర్నూల్ పట్టణంలో నిర్మించిన యానిమల్ బర్త్‌కేర్ సెంటర్‌ను ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్ రెడ్డి, అదనపు కలెక్టర్ దేవసహాయంతో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సేవల్లో భాగంగా వీధి కుక్కలను పట్టుకుని యానిమల్ బర్త్‌కేర్ సెంటర్‌లో జననియంత్రణ ఆపరేషన్లు చేసి వాటిని వాటి సహజ జీవావరణంలో వదిలే విధానాన్ని అమలు చేస్తారని తెలిపారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రగతి నిధులను ఉపయోగించి వీధి కుక్కల సమస్యను సమర్థవంతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ఈ కేంద్రం ప్రారంభంతో వీధి కుక్కల నియంత్రణ, శునకాల ఆరోగ్య సంరక్షణ సాధ్యమవుతుందని భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. వీధి కుక్కల సంఖ్య తగ్గించడంతోపాటు ప్రజలకు సురక్షితమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశు వైద్య శాఖ అధికారి జీవీ.రమేష్, మునిసిపల్ కమిషనర్ నరేష్‌బాబు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రక్షణకు అందుబాటులో ఉంటాం : డీఎస్పీ

ఆత్మకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజా రక్షణ కోసం ఎల్లప్పుడు పోలీసులు అందుబాటులో ఉంటారని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని బీసీ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రజా రక్షణ కోసం ఎల్లప్పుడు కృషి చేస్తూ.. వారికి నమ్మకం కలిగించేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కాలనీలలో సంచరించడం, అనుమతి లేని వాహనాలు, సైబర్ క్రైమ్ వంటి సమస్యలు తలెత్తితే సంబంధించిన స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు, బ్యాంకు అధికారులు అంటూ బ్యాంక్ వివరాలు కోరితే వివరాలు చెప్పకూడదని తెలిపారు. కార్యక్రమంలో సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ ఆరుగురు ఎస్ఐలు, 40 మంది కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

విద్యార్థి గగన్‌చంద్రకు అభినందనలు

- జాతీయ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ - గ్రామంలో అభినందన ర్యాలీ

బల్మూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత దేశ స్థాయిలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబర్చి వచ్చిన మండలానికి చెందిన విద్యార్థికి ఘన సన్మానం జరిగింది. ఆ విద్యార్థిని అభినందిస్తూ మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహించి, ప్రశంసించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గగన్‌చంద్ర ఇటీవల పుదుచ్చేరిలో జరిగిన దక్షిణ భారతదేశ స్థాయి సైన్స్‌ఫెయిర్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబర్చాడు. ఆ విద్యార్థి తయారు చేసిన త్రీ ఇన్‌వన్ హైబ్రిడ్ బైస్కిల్‌కు ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో మూడో బహుమతి పొంది జాతీయ స్థాయికి ఎంపికైంది. కరెంటు చార్జింగ్‌తో, సోలార్ ప్యానల్ విధానంతో, పెట్రోల్‌తో నడవడం ఈ సైకిల్ ప్రత్యేకత. బుధవారం మండల కేంద్రంలో గగన్‌చంద్రను అతని తండ్రి భాస్కర్‌ను పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. పాఠశాల పేరు ప్రఖ్యాతలను దేశవ్యాప్తంగా తీసుకెళ్లిన గగన్‌చంద్రను పలువురు అభినందించారు. అలాగే బల్మూరులోని యూనియన్ బ్యాంక్ మేనేజర్ పవన్‌కుమార్, ఉమామహేశ్వర్, కృష్ణవంశీరెడ్డి, సిబ్బంది, గ్రామస్థులు గగన్‌చంద్రను సన్మానించి అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ గగన్‌చంద్రను స్ఫూర్తిగా తీసుకొని మిగతా విద్యార్థులకు సూచించారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థి గగన్‌చంద్రను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పూర్తికాని పునరావాసం



కానాయపల్లి గ్రామ నిర్వాసితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాసం

కొత్తకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని శంకర సముద్ర రిజర్వాయర్ నిర్వాసితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాసం పనులు పూర్తి కావడం లేదు. దీంతో 90 వేల ఎకరాలకు సాగునీరు అందిచాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. భీమా ప్రాజెక్టులో అంతర్భాగమైన శంకర సముద్ర రిజర్వాయర్ పనులకు జలయజ్ఞంలో భాగంగా 2006లో శ్రీకారం చుట్టారు. రిజర్వాయర్ పనులు ముగింపు దశకు రావడంతో నిర్వాసితుల కోసం కానాయపల్లి గ్రామ శివారులోనే 111 ఎకరాలను సేకరించారు. అందులో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ భవనాలు, రైతు భవనం, గ్రామ పంచాయతీ భవనం, దేవాలయాలు, మసీదు, చర్చి నిర్మాణాలకు స్థలం పోను 1,129 ప్లాట్లు చేశారు. పునరావాసంలో నిర్వాసితుల మౌలిక వసతుల కల్పించడం కోసం రూ.12.40 కోట్లు మంజూరు చేశారు. ప్లాట్ల లెవలింగ్ కోసం మరో రూ.2 కోట్లు విడుదల చేశారు. కానీ పునరావాసం పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించేది లేదు పనులు ముగిసేది లేదని ఆరోపణలు లేకపోలేదు.

మూడడుగులు ముందుకు.. ఏడడుగులు వెనక్కి

పునరావాస అభివృద్ధి పనులు ఏడేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. పనులు పూర్తి చేయడానికి అధికారులు ఒత్తిడి చేస్తున్నట్లుగానే బిల్లుల చెల్లింపులు లేని కారణంగా పనులు మూడడుగులు ముందుకు ఏడడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. నత్తనడకన కొనసాగుతున్న పనులను చూస్తున్న ఆయకట్టు రైతులు సాగునీరు ఇప్పుడేవీ వచ్చేటట్లు లేదని చర్చించుకుంటున్నారు. పునరావాసం పనులు ఇప్పుడే పూర్తి చేసేటట్లు లేదని నిర్వాసితులు నీరిసించిపోతున్నారు.

మంత్రుల హామీలు నెరవేరడం లేదు..

రిజర్వాయర్, పునరావాస అసంపూర్తి పనులు సందర్శనకు వచ్చిన మంత్రుల హామీలు నెరవేరడం లేదు. గతంలో భారీ సాగునీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, వ్యవసాయ శాఖ నిరంజన్‌రెడ్డి రిజర్వాయర్‌ను పరిశీలించి ఆరు నెలల్లో నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి ఆయకట్టు మొత్తానికి సాగునీరిస్తామన్న హామీ అమలు కాలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు ప్రాజెక్టు సందర్శన పేరుతో సెప్టెంబరు 25న వచ్చి నివేదిక తెప్పించుకొని నిధులు మంజూరు చేస్తామని చెప్పి వెళ్లారు. ఆర్‌అండ్‌ఆర్ కమిషనరు కృష్ణారెడ్డి పునరావాసం కేంద్రాన్ని పరిశీలించి రూ.38 కోట్లు అవసరం అవుతాయని నివేదిక ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల్లో శంకర సముద్ర రిజర్వాయర్ పూర్తికి రూ.38 కోట్లు కావాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రస్తావించినా నిధుల మంజూరుకు కార్యరూప దాల్చలేదు.

చేసిన పనులకు బిల్లుల చెల్లింపు

పనులు చేసినట్లుగా బిల్లుల చెల్లింపులు కొనసాగుతాయి. పునరావాసంలో పనులు ముగింపు దశకు వచ్చాయి. ప్రధాన రోడ్లల్లో బీటీ వేశాం. అలాగే కాలనీ రోడ్లల్లో సీసీ వేశాం, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు, వాటర్ పైపులైన్ పనులు పూర్తి అయ్యాయి. అంతర్గత రోడ్లల్లో బీటీ వేయాల్సి ఉంది.

- అశోక్ డీఈ, పంచాయతీరాజ్ శాఖ

ప్రారంభించింది మేమే.. పూర్తి చేసేది మేమే ..



శంకర సముద్ర రిజర్వా యర్ పనులను ప్రారంభిం చింది (కాంగ్రెస్ ప్రభుత్వం) మేమే. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఈ మార్చి చివరి నాటికి పునరావాసం పనులు పూర్తి చేయిస్తాం. రూ.38 కోట్లు విడుదల అయ్యాక నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తాం.

- మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యే, దేవరకద్ర

ఘనంగా ఈదమ్మ ఆలయ పునఃప్రతిష్ఠోత్సవాలు

కొల్లాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఆరాధ్య దైవంగా పూజించే ఈదమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్ఠోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో 108 కలశాలతో సప్త నదుల నీటిని సేకరించి పట్టణంలోని మాధవస్వామి దేవాలయం నుంచి ర్యాలీగా ఈదమ్మ తల్లి ఆలయం వద్దకు చేరుకున్నారు. సప్తనదుల నీటితో ఈదమ్మ తల్లి విగ్రహానికి జలాధివాసం చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి దంపతులు హోమ పూజల్లో పాల్గొన్నారు. నేడు నిత్య పూజలు, ఆలయ శుద్ధి, మంగళ హారతి కార్యక్రమంతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మహోత్సవాల్లో భాగంగా కొల్లాపూర్ పట్టణంలో మూడు రోజుల పాటు మాంసం విక్రయాలు నిలిపి వేశారు. మహిళలు చిన్నారులు భక్తి శ్రద్ధలతో కుటుంబ సభ్యులంతా కలిసి ఈదమ్మ తల్లి దేవాలయం పునః ప్రతిష్ఠ మహోత్సవాల్లో పాల్గొంటున్నారు.

బిల్లులు చెల్లించకుంటే ఆత్మహత్య చేసుకుంటా

- తెల్లరాళ్లపల్లితండా మాజీ సర్పంచ్ శాంతమ్మ

పాన్‌గల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బిల్లులు చెల్లించకుంటే ఆత్మహత్య చేసుకుంటానని మాజీ సర్పంచ్ శాంతమ్మ బుధవారం తెల్లరాళ్లపల్లి గ్రామ పంచాయతీ ఎదుట నిరసన తెలిపారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లి తండా మాజీ సర్పంచ్ శాంతమ్మ గ్రామంలో అభివృద్ధి పనుల కోసం రూ.12 లక్షలు ఖర్చు చేశానని, రెండేళ్లు గడిచినా బిల్లులు రాకపోవడంతో వడ్డీలు కట్టలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేసింది. తక్షణమే బిల్లులు చెల్లించాలని, చెల్లించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించించారు.

అక్రమాలపై విచారణ చేయాలి

- మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్ రెడ్డి

వడ్డేపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్డీఎస్ ఆయకట్టుదారుల సంఘం మాజీ చైర్మన్ తనగల సీతారాం రెడ్డి అవినీతి, అక్రమాలపై వి చారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో నిర్మించిన డ్వాక్రా భవనం ఇప్పటి వరకు ఆయన కబ్జాలోనే ఉందన్నారు. అలాగే గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చిన స్థలాన్ని కూడా అమ్ముకున్నారని ఆరోపించారు. పాఠశాలకు ఇచ్చిన స్థలం అనే విషయంపై కోర్టుకు వెళ్లి ఆర్డర్స్ ఇచ్చిన ఆయనపై పోలీసులు చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారన్నారు. ఈ విషయాలపై కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని తెలిపారు. తనగలకు చెందిన ఆర్డీఎస్ మాజీ చైర్మన్‌కు గతంలో ఎమ్మెల్యే అబ్రహం, ప్రస్తుత ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్‌లు అండగా ఉన్నారని ఆరోపించారు. ఈ నెల చివరి నాటిని ఆయనపై చర్యలు తీసుకోకపోతే సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పుట్ట ఆంజనేయులు



మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యుడు పుట్ట ఆంజనేయులు

వనపర్తి రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని కేంద్రం ప్రతిపాదన విరమించుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పుట్ట ఆంజనేయులు అన్నారు. బుధవారం పట్టణంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ రాష్ట్ర నాల్గవ మహాసభలు ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో విజయవంతంగా జరిగాయన్నారు. ఈ సభలలో 50 ప్రజా సమస్యలపై తీర్మానాలు చేయడం జరిగిందని, భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా 60 మందిని ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. చిన్న, మధ్య తరహా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఉపాధి సమస్యలు, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొత్తం 50 తీర్మాణాలు ఈ మహాసభల్లో కూడా ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. సమావేశంలో జబ్బార్, బాల్‌రెడ్డి, రాజు, లక్ష్మి, మేకల ఆంజనేయులు, పరమేశ్వరాచారి, రాములు, రాబర్ట్, బీసన్న, మహేష్, ఉమా, సాయిలీల పాల్గొన్నారు.

సర్వే అధికారులతో గొడవకు దిగిన రైతులు

అచ్చంపేటటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట శివారు నుంచి కాల్వ నిర్మాణం కోసం సర్వే చేస్తున్న అధికారులను రైతులు అడ్డుకున్నారు. ఉన్న కొద్దిపాటి భూములు కాల్వ నిర్మాణంలో పోతే తమ పరిస్థితి ఏంటని రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. వివరాల్లోకి వెళ్తే..మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకంలో భాగంగా బల్మూరు మండలంలో ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మాణం, అక్కడి నుంచి ఉప్పునుంతల మండలం పెనిమిళ్ల రిజర్వాయర్ కోసం కనెక్టివిటీ కెనాల్ కోసం భూసేకరణ చేయాల్సి ఉంది. అందుకోసం ఇంజనీరింగ్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు బుధవారం అచ్చంపేట సమీపంలో గుంపన్‌పల్లి సమీపంలో సర్వే కోసం వెళ్లారు. పొలాల్లో సర్వే నిర్వహించేందుకు వచ్చిన అధికారులను రైతులు పొలాల్లోకి రాకుండా అడ్డుకున్నారు. రైతులకు సర్వేఅధికారుల మధ్య వాగ్వాదం నెలకొని కొంత ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్ఐ రమేష్ పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఎంతకూ వినకపోవడంతో రైతులను చెల్లాచెదురు చేశారు. గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ తమకు ఉన్న ఎకర, రెండు ఎకరాలలో కేఎల్ఐ కాల్వలు పోతే తమ పరిస్థితి ఏంటని వాపోతున్నారు. తమకు ఆధారమైన భూమిలో సర్వే పనులు నిలిపివేయాలని రైతులు కోరారు.



రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

ధాన్యం పేరుతో దండుకున్న
అధికారులను సస్పెండ్ చేయాలి

● బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న రాచాల యుగంధర్ గౌడ్

వనపర్తి అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం పేరుతో కోట్ల రూపాయలు దండుకున్న పౌరసరఫరాల శాఖలోని అధికారి అవినీతి అక్రమాల పై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ... పౌర సరఫరాల శాఖ అధికారి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, జిల్లాలో దాదాపు 40 మిల్లులకు అర్హత ఉన్నా, తప్పుడు సమాచారంతో పక్క జిల్లాలకు ధాన్యం కేటాయించి తన కార్యాలయంలో పని చేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బంధువుల అకౌంట్‌లోకి డబ్బులు వేయించుకున్నారని ఆరోపించారు. పక్క జిల్లా మిల్లులకు కేటాయింపులు చేసినందుకు బస్తాకు రూ.5 దండుకున్నారని, కొన్ని మిల్లుల నుంచి ఏక మొత్తంగా రూ.50వేల నుంచి రూ. లక్ష వరకు లంచాలు తీసుకున్నారని అన్నారు. విద్యుత్ కనెక్షన్ లేకున్నా, కెపాసిటీకి మించి కొన్ని మిల్లులకు కేటాయింపులు చేశారని డబ్బులు ఇచ్చిన వారికి సన్న ధాన్యం, ఇవ్వని వారికి దొడ్డు రకాలు కేటాయింపులు చేశారని, వీటిపై విచారణ జరపాలని కోరారు. అధికారులు చేసిన నిర్వాకం వల్ల ఉపాధి కోసం మిల్లులు పెట్టుకున్న 40 మందితో పాటు వాటిలో పని చేసే కార్మికులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆ అధికారి సివిల్ సప్లయ్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారన్నారు. అధికారుల అవినీతికి సంబంధించిన అన్ని ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని, ఏ ఒక్కరిని వదిలిపెట్టే పరిస్థితి ఉండదని హెచ్చరించారు.

క్రైం కార్నర్

కృష్ణానదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కృష్ణ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా కేంద్రానికి చెందిన పి.రాజు (43) కృష్ణానదిలో మునిగి మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని సరిహద్దు కర్ణాటక రాష్ట్ర రాయచూరు జిల్లా దేవసూగూరు శివారులోని కృష్ణానదిలో పడి మృతి చెందాడని ఏఎస్ఐ క్రిరాలింగప్ప తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణానదిలో స్నానం చేయడానికి వెళ్లి నీటిలో మునిగినట్లు అనుమానం వ్యక్తం చేశారు. కొందరు స్నానాలు చేస్తూ ఉండగా పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని నదిలో నుంచి తీసి అంబులెన్స్ ద్వారా రాయచూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరించినట్లు వారు అన్నారు.

వాటర్‌పైపు తలపై పడి విద్యార్థినికి గాయాలు

అచ్చంపేటటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వసతిగృహం భవనంపై నుంచి వాటర్‌పైప్ (ఇనుపపైప్) పడి విద్యార్థిని తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలు తెలిపిన వివరాలు తెలిపిన ప్రకారం.. పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఉంటూ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతుంది.. మంగళవారం ఉదయం ముఖం కడుగుతుండగా భవనంపై నుంచి వాటర్‌పైప్ తలపై పడింది. దీంతో బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం అయింది. గమనించిన తోటివిద్యార్థులు వర్కర్లకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఆమెను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థినికి వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. తలకు తీవ్ర గాయం కావడంతో 15కుట్లు వేసినట్లు వైద్యులు తెలిపారు. స్కానింగ్ అచ్చంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో లేకపోకవడంతో సిటీస్కానింగ్ కోసం జిల్లా ఆసుపత్రికి హాస్టల్ వార్డెన్ ఎల్లమ్మ, తల్లిదండ్రులు తీసుకెళ్లారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉందని వార్డెన్ తెలిపారు. ఇనుపపైప్‌ను కోతులు కదిలించడం వల్ల ఊడిందా లేక మరేదైన కారణం చేత ఊడిందా అని తెలియాల్సివుంది.


తలకు బలమైన గాయం కావడంతో కుట్లు వేసి కట్టుకట్టిన వైద్యులు

చిరుత సంచారం

- భయాందోళన ప్రజలు

మరికల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మరికల్ మండలం జిన్నారం గ్రామ శివారు పరిసరాల్లో మంగళవారం అర్థరాత్రి చిరుత సంచరించినట్లు తెలియ డంతో గ్రామ ప్రజలు, రైతులు భయభ్రాంతులు చెందుతున్నారు. బుధవారం తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో పొలాల్లో తిరుగుతుండగా చూసి భయపడినట్లు స్థానికులు తెలిపారు. చిరుత దాడిలో 20కిపైగా కో ళ్లు మృతి చెందాయి. ఈ విషయంపై ఫారెస్ట్ అధికారులకు గ్రామస్తులు స మాచారం అందించారు. వెంటనే ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పద్మారావు, బీట్ ఆఫీసర్ మల్లేష్ గ్రామానికి చేరుకుని చిరుత సంచరించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు చిరుత అడుగుజాడలను గుర్తించారు. చిరుత సంచరిస్తున్నట్లు ఆనవాళ్లు లేవని హైన(మేకం) సంచరించినట్లు గుర్తించారు. ఈ ప్రాంత రైతులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ ఆఫీసర్లు తెలిపారు.


చిరుత పాదముద్రలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

స్పీడ్ బ్రేకరే ఆమె పాలిట మృత్యువు

- బైక్ నుంచి పడి మహిళ మృతి

గద్వాల(మల్దకల్), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్పీడ్ బ్రేకరే ఆమె పాలిట మృత్యువైంది. ఈ మధ్యనే కొత్తగా వేసిన స్పీడ్ బ్రేకర్ వాహనదారులకు కనిపించకపోవడంతో చాలా మంది మృత్యువు నుంచి తప్పించుకోగా అయిజ మండల కేంద్రానికి చెందిన సరస్వతి(53)ని బలిగొంది. ఇందుకు సంబంధించి వాహనదారులతో పాటు మల్దకల్ ప్రొహిబేషనరీ ఎస్సై స్వాతి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అయిజ మండల కేంద్రానికి చెందిన సరస్వతి(53) ఆమె మరిది ప్రతాప్ గౌడ్‌తో కలిసి గద్వాలలో పని ముగించుకొని బుధవారం సాయంత్రం అయిజకు మోటార్ బైక్‌పై వెళుతున్నారు. మల్దకల్ మండలం అమరవాయి దగ్గర పెట్రోల్ బంక్ సమీపంలో ఈ మధ్యనే కొత్తగా వేసిన స్పీడ్ బ్రేకర్ కనిపించకపోవడంతో మోటార్ బైక్‌పై వెళుతున్న వారి వాహనం అదుపుతప్పి వెనుక కూర్చున్న సరస్వతి కిందపడిపోయింది. దీంతో తలకు తీవ్రగాయం అయిన ఆమెను గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందింది. ఈ మేరకు మల్దకల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నారు.

బీరువాలో నుంచి డబ్బు అపహరణ

ఉప్పునుంతల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో బీరువాలో నుంచి డబ్బులు అపహరించిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల గ్రామంలో చోటుచేసుకొంది. ఎస్సై వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మడ్డి తిరుపతయ్యగౌడ్ ఈ నెల 26న తన వ్యవసాయ పొలంలో వరి నాట్లు వేయడం కోసం ఇతరుల వద్ద ఒక లక్ష రూపాయలు అప్పుకు తీసుకువచ్చాడు. అందులో నుంచి బ్యాంకులో 17 వేల రూపాయలు కట్టి మిగతా 83 వేలు ఇంట్లో బీరువాలో పెట్టారు. బుధవారం ఉదయం కూలీ వారికి డబ్బులు ఇవ్వడం కోసం బీరువా వద్దకు వెళ్లి చూడగా డబ్బులు కనిపించడం లేదన్నారు. ఇట్టి డబ్బులు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించి ఉంటారని తిరుపతయ్య గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'ఉపాధి' లేని గ్రామాలు!

● పనికోసం ఇతర ప్రాంతాలకు వలస
● మిరప కోత, ఇటుకల తయారీ కోసం పయనం
● ఖాళీ అవుతున్న గ్రామాలు

గట్టు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పనులు లేకపోవడంతో బతుకు జీవుడా అంటూ పలువురు కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు. ప్రస్తుతం కూలీలకు స్వంత గ్రామాల్లో పనులు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దస్థితి నెలకొన్నది. గ్రామాల్లో జాతీయ ఉపాధి పథకం పనులు జరగక పోవడంతో కూలీల జీవనం కష్టతరమై పోయింది. దీంతో కూలీలు ప్రత్యామ్నాయ పనులు వెదుకుంటూ ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారు. ఇందులో భాగంగా మండలంలో అనేక గ్రామాల్లో వేలమంది కూలీలు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని గూంటురు వంటి ప్రాంతంలో మిర్చి కోయడానికి వెళ్లగా, మరికొంత మంది ఇటుక పెల్ల తయారీ కోసం వలస వెళుతున్నారు. దీంతో గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. ఇప్పటికే వేల మంది వలస బాట పట్టినట్లు తెలుస్తున్నది. చాగదోణ గ్రామం నుంచి సుమారు వంద కుటుంబాలకు పైగా గుంటూరుకు మిర్చి కోతకు తట్టా బుట్ట సర్దుకుని పిల్లా పాపలతో వలస వెళ్లారు.


మిర్చి కోత కోసం గుంటూరు బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న కూలీలు

● ఉపాధి పనులు లేక..

గ్రామాల్లో కూలీలను ఆదుకునేందుకు ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు జరగక పోవడంతో కూలీలకు ఉపాధి లేకుండాపోయింది. మండలంలో పేరుకు మాత్రమే ఉపాధి హామీ పథకం తప్ప కూలీలకు ప్రయోజనం నింపడం లేదు. ఈ పథకం చుట్టూ గ్రామాల్లో రాజకీయాలు చేరడంతో పథకం యొక్క లక్ష్యాలు పక్కదారి పట్టాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించాల్సిన ఉపాధి సిబ్బంది గ్రామాల్లో కన్పించకపోవడంతో మండలంలో ఉపాధి పనులు ప్రశ్నార్థకంగా మారాయి.మండలంలో మొత్తం 17660 మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో ఈ ఆర్థిక సంవత్సరంలో 5885 మంది కుటుంబాలలో 10740 మందికి పనులు కల్పించినట్లు ఉపాధిహామి రికార్డులలో పేర్కొన్నారు. ప్రస్తుతం 27 గ్రామపంచాయతీల్లో మొత్తం రోజుకు 270 మంది కూలీలు పనులు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలో ఉపాధి పనులు జరుగుతున్నట్లు కేవలం రికార్డులకే పరిమితం అయ్యాయి తప్ప క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని కూలీలు మండి పడుతున్నారు.


ఇటీవల చాగదోణ నుంచి డీసీఎం వాహనంలో ఉపాధి పనుల కోసం గుంటూరుకు బయలు దేరిన కూలీలు

● సిబ్బంది కరువు

గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పని చేయించాల్సిన ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో పనులు చేయించేవారు కరువయ్యారు. 27 గ్రామ పంచాయతీలకు గాను కేవలం 10 మంది మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు. మిగతా గ్రామాల్లో సీనియర్ మేట్‌లను పెట్టి పనులు కల్పించాల్సి ఉన్నది. పనుల నిర్వహణకు సిబ్బందిలేకపోవడం కారణంగా పనులు జరగడం లేదని గ్రామ కూలీలు పేర్కొంటున్నారు.

● సీజనల్ పనులకు వెళుతున్నారు



గ్రామాల్లో ప్రస్తుతం సీజనల్ పంటల పనులకు కూలీలు వలస వెళుతున్నారు. వారు మళ్లీ ఫిబ్రవరి నెలలో తిరిగి వస్తారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు ఫిబ్రవరి నెలలో ప్రారంభమౌతాయి. ఈ ఆర్థిక సంవత్సరం కూలీలకు 2, 12 159 పనిదినాలు కల్పించాం. జాబ్ కార్డు ఉన్న ప్రతీ కూలీకి పనులు కల్పించడమే మా లక్ష్యం.

- పాగుంట స్వామి, ఎన్‌అర్‌ఈజీఎస్ ఏపీవో

జాతీయ స్థాయి క్రీడలకు కల్వకుర్తి విద్యార్థులు

కల్వకుర్తి/మక్తల్, జనవరి (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని ఎంజేపీటీడబ్ల్యూఆర్ఎస్ విద్యార్థినులు జాతీయ స్థాయి జూనియర్ టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు నటరాజ్, ప్రధాన కార్యదర్శి వడన్నలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న కరీంనగర్‌లో జరిగే 8వ రాష్ట్రస్థాయి జూనియర్ టెన్నికాయిట్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వారు పేర్కొన్నారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2వరకు చెన్నైలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ జట్టు తరపున జాహ్నవి, మమత, మేఘనలు పాల్గొంటారని వారు తెలిపారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపీడీవో ఎస్.వెంక ట్రాములు, ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమణి, పీడీ సింధూలు అభినందించారు.


టెన్నికాయిట్ పోటీలకు ఎన్నికైన ఎంజేపీటీడబ్ల్యూఆర్ఎస్ విద్యార్థినులతో ఎంపీడీవో ఎస్.వెంకట్రాములు

● ఈనెల 26న హైదరాబాద్ అంబర్‌పేటలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీల్లో మక్తల్ పట్టణానికి చెందిన విద్యార్థి మొహ్మద్ పర్హాన్ అసమాన క్రీడా నైపుణ్యత ప్రదర్శించి జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్లు టెన్నికాయిట్ జిల్లా ప్రధాన కార్యదర్శి దీప తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పర్హాన్‌ను సీఐ చంద్రశేఖర్ అభినందించారు. పీఈటీలు రమేష్‌కుమార్, దామోదర్, స్వప్న, రాకేష్, సత్య అంజనేయులు, హాజీ బాబా, నందులు పాల్గొన్నారు.


మక్తల్‌లో క్రీడాకారులను సన్మానిస్తున్న సీఐ చంద్రశేఖర్

కిక్ బాక్సింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

● డివైఎస్‌వో సుధీర్ కుమార్ రెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి29 (ఆంధ్రజ్యోతి) :జిల్లా విద్యార్థులు అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికవ్వడం హర్షణీయమని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్ కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణరాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27, 28వ తేదీలలో హైదరాబాద్ ఉప్పల్‌లో రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నుంచి గోజురియో కరాటే అండ్ కిక్ బాక్సింగ్ అకాడమీ విద్యార్థులు హాజరై 11 స్వర్ణ పతకాలు, రెండు రజత, ఒక కాంస్య పతకం సాధించినట్లు అకాడమీ వారు తెలిపారు. విద్యార్థులు అనన్య, హరిని, ఝాన్సీ, రుద్ర, కృష్ణ, చైతన్య, యోగి, సిద్ధార్థ, సాయి, రేవంత్, హరీష్, కార్తికేయ, మల్లేష్, మోక్షిత్, కరుణాకర్, పవన్ కుమార్, సత్తా చాటి పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. వీరు ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు న్యూ ఢిల్లీలో జరగబోయే అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలలో పాల్గొంటారని అకాడమీ నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం డీవైఎస్‌వో సుధీర్ కుమార్ రెడ్డి కలిసి అభినందించారు. గోజురియో కరాటే అండ్ కిక్ బాక్సింగ్ అకాడమీ కరాటే మాస్టర్ శేఖర్, శివకృష్ణ యాదవ్, వరుణ్, సీనియర్ విద్యార్థులు చంద్రకాంత్, చక్రవర్తి, మణికంఠ, జ్ఞానేశ్వర్, శ్రీనాథ్, రేణుక, కీర్తన పాల్గొన్నారు.


కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డీవైఎస్‌వో సుధీర్ కుమార్ రెడ్డి

జాతీయ స్థాయి కరాటే, కిక్ బాక్సింగ్ పోటీలకు..

వనపర్తి రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండలం చిట్యాల గ్రామం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని బుధవారం కరాటే కిక్ బాక్సింగ్ మాస్టర్ వరుణ్ తెలిపారు. ఈ నెల 26, 27న అండర్ 10, 11, 12 స్థాయి విభాగంలో తెలంగాణ స్టేట్ లెవెల్ కరాటే కిక్ బాక్సింగ్ పోటీల్లో చిట్యాల గ్రామానికి చెందిన భవ్యశ్రీ, శ్రావ్యశ్రీ పాల్గొని ప్రతిభ కనబరిచారు. భవ్యశ్రీ బంగారు పతకం, శ్రావశ్యశ్రీ బ్రాంజ్ మెడల్ పతకాన్ని సాధించారు. అండర్ 13, 14, 15 స్థాయి విభాగంలో కరాటే కిక్ బాక్సింగ్ పోటీల్లో ఝాన్సీ సిద్ధార్థలు పాల్గొని బంగారు పతకాలు సాధించారు. తెలంగాణ స్టేట్ లెవెల్ కరాటే కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఫిబ్రవరి నెలలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి కరాటే కిక్ బాక్సింగ్ పోటీలకు విద్యార్థులు పాల్గొనునున్నట్లు మాస్టర్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను జిల్లా అధికార ప్రతినిధి మీడియా ఇన్‌చార్జి పెద్దిరాజు, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ మండల కోశాధికారి అమరవాది నరేంద్ర శెట్టి, బూత్ కమిటీ అధ్యక్షులు ప్రదీప్ కుమార్, రమేష్, పోతు భరత్, నరేష్ కుమార్, అంజి, గుట్టగాడి రాజులు శాలువాతో సన్మానించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న స్కూటీ

- యువకుడి మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఊట్కూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ముగ్గురు యువకులు స్కూటీపై వెళుతూ ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. ఎండీ ఇర్ఫాన్ (17) మృతి చెందగా, మరో ఇద్దరు యువకులు గాయపడిన సంఘటన బుధవారం మండల కేంద్రంలోని చెక్‌పోస్టు సమీపంలో గల ఊర లక్ష్మమ్మ ఆలయం వద్ద చోటు చేసుకుంది. ఊట్కూర్ ఎస్సై కృష్ణంరాజు, గ్రామస్థుల కథనం ప్రకారం... ఊట్కూర్ గ్రామానికి చెందిన ఎండీ ఇర్ఫాన్, షాబాజ్, షఫాయత్ అనే ముగ్గురు యువకులు ఉదయం గ్రామంలో నుంచి చెక్‌పోస్టు వైపు వెళుతున్నారు. గ్రామం దాటిన అనంతరం గల ఊర లక్ష్మమ్మ ఆలయం సమీపంలో తన ముందు నారాయణపేట వైపు వెళ్లుతున్న బస్సును వెనక నుంచి దాటి ముందుకు పోతుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. వాహనంతో పాటు ఎగిరి ముగ్గురు కింద పడిపోయారు. దీంతో వెనుక కూర్చున్న షాబాజ్, ఎండీ ఇర్ఫాన్‌లు ఎగిరిపడిపోవడంతో తలకు బలమైన గాయాలై రక్తస్రావం జరిగి రోడ్డుపై పడిపోయారు. వాహనం నడుపుతున్న షఫాయత్‌కు మాత్రం బండి వద్ద ఇరుక్కుపోవడంతో కుడి కాలు, కుడి చేయి విరిగిపోయి లేవకుండా పడిపోయాడు. ఈ రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అటు వైపు నుంచి వెళుతున్న గ్రామస్థులు, యువకులు వారిని లేపే ప్రయత్నం చేశారు. చలనం లేకపోవడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అయినా అంబులెన్స్ రాకపోవడంతో హుటాహుటిన ముగ్గురిని ఆటోలో నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం వైద్యుల సూచన మేరకు తలకు బలమైన గాయాలు అయిన ఇర్ఫాన్, షాబాజ్‌లను హైదరాబాద్ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తీసుకెళుతుండగా షాద్‌నగర్ సమీనపంలో ఇర్ఫాన్ అనే యువకుడు మృతి చెందాడు. మరో అంబులెన్స్‌లో ఉన్న షాబాజ్‌ను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అలాగే కాలు, చేయి విరిగిన షఫాయత్‌ను మరో అంబులెన్స్‌లో ఎస్వీఎస్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చేర్పించి అనంతరం చికిత్స నిర్వహిస్తున్నారు. దారిలో మృతి చెందిన ఇర్ఫాన్ మృతదేహాన్ని తిరిగి నారాయణపేట ఆసుపత్రికి తీసుకొచ్చి అక్కడే గ్రామ సర్పంచ్ సూర్యప్రకాష్ రెడ్డి, ఇతర నాయకులు ముందుండి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాత్రి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎంకంపేట వీధికి చెందిన ఇస్మాయిల్ పెద్దకుమారుడైన ఇర్ఫాన్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించడం అందరిని కంట తడి పెట్టించింది.

పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణం రాజు తెలిపారు. కాగా, ప్రమాదంలో మృతి చెందిన ఎండీ ఇర్ఫాన్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పరామర్శించారు. ఆసుపత్రిలో పోస్టుమార్టం దగ్గర ఉండి చేయించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేశారు.


ఎండీ ఇర్ఫాన్(ఫైల్)


గాయపడిన యువకుడిని పేట ఆసుపత్రి నుంచి మహబూబ్ నగర్ ఆసుపత్రికి తరలిస్తున్న గ్రామస్థులు

టీడీసీఏ టోర్నీలో ఫైనల్‌కు చేరిన జిల్లా జట్టు

- సెమీస్‌లో ఆదిలాబాద్‌పై ఘన విజయం


ఉమ్మడి జిల్లా టీడీసీఏ జట్టుతో శాట్ మాజీ చైర్మన్, టీడీసీఏ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వరెడ్డి, కన్వీనర్ నవీన్‌కుమార్

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ దోమలగూడ లో జరుగుతున్న తెలంగాణ డిస్ట్రిక్ అసోసియేషన్ అంత ర్ జిల్లా టీ-20 క్రికెట్ టో ర్నీలో ఉమ్మడి మహబూబ్‌న గర్ జిల్లా జట్టు ఫైనల్‌కు చేరింది. బుధవారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఆది లాబాద్‌పై 8 వికెట్ల తేడాతో చేరుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఆదిలాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో ప్రియాన్ 23, షేక్ ఆర్బాన్ 20 పరుగులు చేశారు. జిల్లా బౌలర్లలో రవితేజ 3 వికెట్లు, సాహిల్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జిల్లా జట్టు 16.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 121 పరుగులు చేసి గెలిచింది. జట్టులో దీపక్ పాటిల్ 47 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో అర్ధసెంచరీ(54) పరుగులు చేసి నాటౌట్‌గా నిలువగా, రవితేజ 38 పరుగులు చేశాడు. సెమీస్‌కు చేరిన జిల్లా జట్టును, కోచ్ మేనేజర్లు నవాజ్, శ్రీనివాస్‌రెడ్డిలను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్, టీడీసీఏ చైర్మన్ వెంకటేశ్వరెడ్డి, ఉమ్మడి జిల్లా కన్వీనర్ నవీన్‌కుమార్ అభినందించారు.

క్రీడల ప్రారంభోత్సవంలో ఏపీ జితేందర్‌రెడ్డి



జాతీయస్థాయి క్రీడల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏపీ జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో నిర్వహిస్తున్న 38వ జాతీయస్థాయి క్రీడలను బుధవారం భారత ప్రధాని నరేంద్రమోడీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం త రఫున తెలంగాణ రాష్ట్ర ప్ర భుత్వ క్రీడా సలహాదారురు, మాజీ పార్లమెంట్ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వీసీఎండీ సోనీ బాలాదేవి పాల్గొన్నారు.

నేడు హీరో డెస్టిని125 మార్కెట్లోకి

పాలమూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హీరో డెస్టిని125ను జిల్లా కేంద్రంలోని ఏనుగొండ అశ్విని హీరో షోరూంలో ఆవిష్కరిస్తున్నట్లు దిలీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూటర్‌లో హీరోనే రారాజు ఈ వాహనాన్ని ప్రజలు అధికంగా ఆదరిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. హీరో డెస్టిని125కు వినియోగదారులు, మెకానిక్‌లు, అభిమానులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

వాచ్‌మన్ పోస్టుకు పేట ఎమ్మెల్యే ఫేక్ లెటర్‌ప్యాడ్

- నిందితులను రిమాండ్‌కు తరలించిన పేట పోలీసులు
- పోస్టు ఇప్పించేందుకు రూ.లక్ష అంగీకారం

నారాయణపేట టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మరికల్ గురుకుల పాఠశాలలో వాచ్‌మన్ పోస్టు కోసం నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి పేరున ఫేక్ లెటర్ ప్యాడ్ సృష్టించిన నిందితులు పోలీసులకు చిక్కారు. మక్తల్ నియోజకవర్గం నర్వ మండలం పెద్దకడ్మూరుకు చెందిన సాకలి శైలేష్ గతంలో గురుకుల పాఠశాలలో పనిచేసిన అనుభవం ఉంది. ఈ క్రమంలో గురుకుల పాఠశాలల నిర్వహణ పైస్థాయి అధికారులతో పరిచయాలు ఉన్నాయి. వాచ్‌మెన్ పోస్టు ఇప్పిస్తానని నమ్మబలికి తన బంధువులైన జ్యోతి, సత్యమ్మలకు చెప్పాడు. పోస్టు కోసం రూ.85 వేలు సైతం తీసుకున్నాడు. ఇచ్చిన మాట ప్రకారం పోస్టు ఇప్పించే క్రమంలో ఫేక్ లెటర్ ప్యాడ్ అని తేలడంతో విషయం బయటకు వచ్చింది.

పోలీసులు విచారణ చేపట్టగా ఫేక్ లెటర్ ప్యాడ్ సృష్టించిన, పోస్టు ఇప్పిస్తానని మోసం చేసిన నిందితుడితో పాటు మరో ఇద్దరు మహిళలను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు హయగ్రీవ కల్యాణం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలోని లక్ష్మీ హయగ్రీవ స్వామి ఆలయంలో గురువారం తొమ్మిది గంటలకు హయగ్రీవ హోమం, 11 గంటలకు లక్ష్మీ హయగ్రీవ కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం హయగ్రీవ స్వామి రథోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

కేజీబీవీని తనిఖీ చేసిన డీఈవో

చిన్నచింతకుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను బుధవారం డీఈవో ప్రవీణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఇంగ్లిష్ బోధన ఏ విధంగా ఉందని, కరాటే క్లాసులు కొనసాగుతున్నాయా? లేదా? ఆరా తీశారు. అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి శ్రీనివాసులు, ఎంఈవో మురళీకృష్ణ, ఎస్‌వో హేమలత పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

దేవరకద్ర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగారం గ్రామంలో గురువారం ప్రీతిఫ్యూర్ ఫాండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామానికి చెందిన రాజేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శివాలయంలో పూజలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 12వ వార్డు పరిధిలోని పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుంచే భక్తులు అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు అల్లంపల్లి మల్లేష్, శివస్వాముల ఆధ్వర్యంలో భజనలు నిర్వహించారు.

కోయిల్‌సాగర్ నీటి విడుదల

దేవరకద్ర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి ఐదు రోజులుగా కుడి, ఎడమ కాల్వ ద్వారా నీటి విడుదల కొనసాగుతోందని ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 31 అడుగులు కాగా, బుధవారం సాయంత్రం నాటికి 27 అడుగులకు చేరుకుంది. అదే విధంగా మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు తాగునీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

రాజాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇద్గాన్‌పల్లికి చెందిన వీరయ్య, ఖానాపూర్‌కు చెందిన కుమ్మరి నర్సింహులు అనారోగ్యంతో మృతి చెందారు. అంత్యక్రియ నిమిత్తం దొండ్లపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు అభిమన్యురెడ్డి రూ.ఐదు వేలు, రూ.పది వేల చొప్పున అందజేయగా, అభిమన్యు యువసేన సభ్యులు బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు.

నిజాలాపూర్‌కు సాగునీరు ఇవ్వాలి

మూసాపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిజాలాపూర్ గ్రామానికి కేఎల్ఐ కాల్వ సాగు నీరు రావడం లేదని, నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని బుధవారం రైతులు ఎమ్మెల్యే జీఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రైతులకు వెంటనే సాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిన్నచింతకుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మరికల్ మండలం రాకొండ గ్రామ శివారు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లతో పాటు ఒక మినీ టిప్పర్ మంగళవారం రాత్రి పట్టుబడినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. చిన్నచింతకుంట మండలం లాల్‌కోట చౌరస్తా వద్ద తనిఖీలు చేస్తుండగా అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సహకారం

మూసాపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల నేమ్ బోర్డును ఏర్పాటు చేసేందుకు 2004-05 పదో తరగతి పూర్వ విద్యార్థులు బుధవారం రూ.10 వేలు ఉపాధ్యాయులకు అందజేశారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధి తమ వంతు సాయం అందించామన్నారు. పూర్వ విద్యార్థులు వి.కృష్ణ, అంజనేయులు, దాసరి వెంకటేష్, బందిగి మహేందర్, మల్లారెడ్డి ఉపాధ్యాయులు శివశరణప్ప, పరమేశ్వర్, కాజన్న, మధుసూదన్ ఉన్నారు.

ఘనంగా నందికోల సేవ

భూత్పూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : భూత్పూర్ పట్టణంలో బుధవారం శివస్వాములు నందికోల సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివస్వాములు ఆంజనేయస్వామి ఆలయం నుంచి చౌరస్తా మీదుగా సంజీవరాయుడి ఆలయానికి చేరుకొని నందికోల సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయం అన్నదానం చేశారు.

అన్ని రంగాల్లో రాణించాలి

మహ్మదాబాద్ జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈవో రాజునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం భారత జాతీయ సంస్కృతి సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో భారత సంస్కృతి, వారసత్వం అనే అంశంపై వ్యాస రచన, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఇంటాక్ సంస్థ సభ్యులు శర్మ, రమేష్ చందర్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

» పట్టించుకోని రెవెన్యూ అధికారులు » పేరుకే నియంత్రణ కమిటీలు



ఇసుక తవ్వకాలతో వాగులో ఏర్పడిన గోతులు

మిడ్జిల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో నిత్యం ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా.. సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇసుక రవాణాను నియంత్రించి, వాల్టా చట్టాన్ని కాపాడాల్సిన అధికారే ఇసుక అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపణలు మండలంలో బాహటంగా వినిపిస్తున్నాయి. రాత్రి వేళ మిడ్జిల్, కొత్తపల్లి గ్రామ శివారుల నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని రైతులు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. దుందుభీ వాగులో ఇసుకను తీయడంతో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వాగులోకి కేఎల్ఐ నీటిని వదలడంతో ఇప్పుడిప్పుడే వాగు పరిసర ప్రాంతాల్లో ఉన్న బోర్లలో నీరు సంవృద్ధిగా ఉంటుందని, ఇసుకను తరలిస్తుండటంతో వాగు పరివాహక ప్రాంత రైతులకు మున్ముందు సాగు నీటికి ఇబ్బందులు తప్పవని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఇసుక నియంత్రణ కమిటీలెక్కడ..?

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, ఫారెస్ట్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, మండల పరిషత్, పోలీస్, వ్యవసాయశాఖ, మైనింగ్‌శాఖలతో పాటు పలు శాఖలకు చెందిన అధికారులతో కలిసి ఇసుక నియంత్రణ కమిటీలను వేసినప్పటికీ ఇప్పటి వరకు ఇసుక అక్రమ రవాణాను అరికట్టిన పాపన పోలేదని వాగు పరివాహక ప్రాంత రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇసుక నియంత్రణ కమిటీలు పేపర్లకే పరిమితమయ్యాయని, ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న అధికారులు కేసులు నమోదు చేయకుండా వాల్టా చట్టం ప్రకారం కొద్దిమేర జరిమానా వేసి వదిలిపెడుతున్నట్లు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండలం ఇసుక అక్రమ రవాణాను నియంత్రించేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి..

గ్రామాల్లో యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నా అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టడం లేదు. జరిమానా విధిస్తూ పట్టుబడిన వాహనాలను వదిలిపెడుతున్నారు. వెంటనే అధికారులు ఇసుక రవాణాను అరికట్టాలి.

- మల్లయ్య, రైతు

భూగర్భ జలాలు అడుగంటుతాయి..

వాగు పరివాహక ప్రాంతంలో ప్రస్తుతం తక్కువ లోతులో నీరు సంవృద్ధిగా ఉంది. ఇసుక అక్రమ రవాణాను నియంత్రించకుంటే భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదముంది. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాదారులపై చర్యలు చేపట్టాలి.

- భీరయ్య, రైతు

బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

» సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ హయాంలో భూత్పూర్ మునిసిపాలిటీ అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గత ఐదేళ్లుగా మునిసిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న పనులు, కొత్తగా చేపట్టబోయే పనులకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకుముందు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో మునిసిపాలిటీని ఉద్ధరించిందేమీ లేదని, అభివృద్ధిని కాంగ్రెస్ అడ్డుకుంటుందని గాలి మాటలు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కొట్టి పారేశారు. మునిసిపాలిటీ అభివృద్ధి పనులకు ట్రాక్టర్లు అవసరం ఉండగా ఐదేళ్లుగా బీఆర్ఎస్ నాయకుల ట్రాక్టర్లు వాడుకొని నెలకు రూ.1.32 లక్షలు బిల్లులు చేసుకొని అక్రమ సంపాదనకు పాల్పడ్డారన్నారు. మునిసిపాలిటీకి స్టాంప్ డ్యూటీ ఆదాయం ఒక్క రూపాయి కూడా రాలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3.98 కోట్లు సంవత్సర కాలంలోనే తీసుకరావడం జరిగిందని స్పష్టం చేశారు. చిరు వ్యాపారులకు భారం కారాదని తైబజారును రద్దు చేశామన్నారు. మండలంలోని వెల్కిచర్ల నుంచి మద్దిగట్లకు రూ.3.58 కోట్ల నిధులతో రోడ్డు నిర్మాణం, నాగకర్నూల్ రోడ్డు నుంచి చౌలతండా వరకు రూ.4.50 కోట్లతో బీటీ రోడ్డు, గాజులపేట నుంచి తాటికొండ మీదుగా బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.65 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.76 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. మండల అధ్యక్షుడు కేసీ రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, విజయ్‌గౌడ్, మాజీ సర్పంచ్ హర్యానాయక్, మట్టి ఆనంద్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు పద్మ పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రాధాన్యం

చిన్నచింతకుంట : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో విద్యాభివృద్ధి కమిటీ, మండల శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు చేపట్టిన ప్రేరణ తరగతుల కార్యక్రమానికి హాజరై, రూ.20 లక్షలు సొంత ఖర్చుతో తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేయటం జరిగిందని, త్వరలో మండలంలోని దమగ్నాపూర్‌లో పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు సుధాకర్‌రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణులు శ్రీనాథచారి, తహసీల్దార్ ఎల్లయ్య, ఎంఈవో మురళీకృష్ణ, దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు రంజిత్‌రెడ్డి, వెంకటేష్, అశోక్, మైమూద్, రాఘవేందర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు దశరథ్, అంబ్రేష్, కొండారెడ్డి పాల్గొన్నారు.

కొత్త హంగులతో కార్పొరేషన్ ముఖ ద్వారాలు

» ఆక్రమణలు అరికట్టాలి » కలెక్టర్ విజయేందిర బోయి



కార్పొరేషన్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు పురపాలిక కార్పొరేషన్ అయినందున కార్పొరేషన్ ఔనత్యాన్ని పెంపొందించేలా పనులు చేపట్టాలని, కార్పొరేషన్‌లోకి వచ్చిన ముఖ ద్వారాలను కొత్త హంగులతో తీర్చిదిద్దాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం మునిసిపల్ పరిధి ప్రారంభమయ్యే రహదారుల వెంట మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ పేర్లతో ముఖ ద్వారాలు ఉన్నాయని, వాటి స్థానంలో కార్పొరేషన్ ముఖ ద్వారాలను ఏర్పాటు చేయాలన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్, అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దివిటిపల్లి గ్రామ పంచాయతీ కూడా కార్పొరేషన్‌లో విలీనమైనందున దివిటిపల్లి జాతీయ రహదారి వద్ద మహబూబ్‌నగర్ వైపు కార్పొరేషన్ పేరిట ముఖ ద్వారం ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. విలీనమైన దివిటిపల్లి, జైనల్లీపూర్ గ్రామ పంచాయతీల రికార్డుల వివరాలు సేకరించాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్ ఆక్రమణలు లేకుండా చూడాలన్నారు. మూడెకరాల ఎకరాల్లో మంచి పార్క్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రాణాలు కాపాడటానికి పటిష్ట చర్యలు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : రోడ్డు ప్రమాదాలు నివారించి, ప్రాణాలు కాపాడటానికి పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ జానకితో కలిసి రోడ్డు భద్రతపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఎన్‌హెచ్ 44పై ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ ప్రాంతాలు పెద్దాయిపల్లి, రాజాపూర్, రంగారెడ్డి గూడెం, మన్నూర్ దాబా, అడ్డాకుల హెచరీల ప్రాంతాల్లో వాహనాల వేగం తగ్గించి, ప్రమాదాల నివారణకు లైటింగ్, రంబుల్ స్ట్రిప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు ఫిబ్రవరి 5 లోగా పనులు పూర్తిచేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను ఆదేశించారు. ముదిరెడ్డిపల్లె నుంచి సెజ్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డు మరమ్మతు చేపట్టాలని కోరారు. కేతేపల్లి వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్‌హెచ్ 167పై వేగ నియంత్రణకు ఏర్పాటు చేసిన రంబుల్ స్ట్రిప్‌ల సైజు తగ్గిన వాటిని పునరుద్ధరించాలని సంబంధిత ఈఈని ఆదేశించారు. ఫిబ్రవరి 1 నుంచి కలెక్టర్ కార్యాలయం, ప్రభుత్వ కార్యాలయాల్లో హెల్మెట్ లేకుండా వచ్చే వాహనదారులను అనుమతించడం జరుగదన్నారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ 2023 కంటే 2024 సంవత్సరంలో ప్రమాదాలు పెరిగినట్లు వివరిస్తూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ ప్రాంతాలు గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్.మోహన్‌రావు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ ఈఈ దేశ్యా, మహబూబ్‌నగర్ ఈఈ రమేశ్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కిషన్, ఆర్టీసీ ఆర్ఎం సంతోష్ కుమార్, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ డిప్యూటీ ఈఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య జిల్లా మహాసభ కమిటీ ఎన్నిక



ఆర్యవైశ్య మహాసభ కమిటీ సభ్యులను శాలువాతో సన్మానించిన రాష్ట్ర నాయకులు

జడ్చర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ ఆవరణలో జిల్లా ఎన్నికల అధికారి అర్థం లక్ష్మయ్య సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాలాది రాంమోహన్, ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రామకృష్ణ, అదనపు కార్యదర్శిగా కొండా చక్రధర్‌గుప్త ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు సాయికిశోర్, కొట్ర మధు, దాచేపల్లి చంద్రయ్య, ఆలంపల్లి మనోహర్, ముటుపూర్ రవీందర్, గుండ నరేశ్, ఆనంద్, మురళి, దేవరాజ్, రాఘవ, అనంతయ్య పాల్గొన్నారు.

పరశవేదీశ్వర స్వామికి రుద్రాభిషేకం

జడ్చర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం కుర్వగడ్డపల్లి సమీపంలోని దుందుభీ నది పరివాహక ప్రాంతంలో ఉన్న పరశవేదీశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు. స్వామి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహించారు. శ్యామ్ కుమార్, స్వప్న, ఆలయ కమిటీ స భ్యులు యాదయ్య, పుట్ట పర్వతాలు, శ్రీనివాస్, సునీత, భద్రప్ప, శ్రీశైలం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్లకు తరలివెళ్లిన ఎమ్మార్పీఎస్ నాయకులు

మిడ్జిల్/బాలానగర్ జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లక్ష డప్పులు, వేల గొంతుల సన్నాహక సమావేశానికి మిడ్జిల్, బాలానగర్ మండల కేంద్రాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం తరలివెళ్లారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం డప్పులతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో జడ్చర్లకు తరలివెళ్లారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ ఎస్సీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె జయప్రద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు సబంధిత విభాగంలో ఎంఎస్సీ, ఎంటెక్, ఎంసీఏ వారు అర్హులని, ఫిబ్రవరి 5వ తేదీలోపు కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డెమో ఉంటుందని తెలిపారు.

పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలి



పాఠశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

దేవరకద్ర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని కోయిల్‌సాగర్ గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, మాట్లాడారు. పాఠశాల ఆవరణలో వాటర్ ట్యాంక్, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన విద్యను అందించాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు రికార్డులో వివరాలు నమోదు చేయాలన్నారు. వేసవిలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు కోయిల్‌సాగర్ ప్రాజెక్టును సందర్శించారు. తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, ఆర్ఐ శరత్ పాల్గొన్నారు.

పారిశ్రామిక సందర్శనకు తరలిన విద్యార్థులు



పారిశ్రామిక సందర్శనకు బయలుదేరిన జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

జడ్చర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సృజనాత్మకత, ఉత్పాదక మార్గాలతో పాటు పరిశోధనను పెంపొందించుకునేందుకు పారిశ్రామిక సందర్శనలు దోహదపడుతాయని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య అన్నారు. కళాశాలలోని తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్, వాణిజ్యశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో టాస్క్ ఇండస్ట్రీ విజిట్ కార్యక్రమంలో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని కోకాకోలా కంపెనీని సందర్శించారు. వాణిజ్యశాస్త్ర పరిధి చాలా విస్తృతమైనదని, పాఠ్యపుస్తకాలతో పాటు అనుభవ పూర్వక అధ్యయనాలు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెంచుతాయన్నారు. అధ్యాపకులు శ్రీనివాసులు, నాగలక్ష్మీ, సులేమాన్, వెంకటరెడ్డి, శంకర్, వనిత, మెంటర్ వీరప్రతాప్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు

నవాబ్‌పేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడరాదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మాడెమోని నర్సింహులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పలు గ్రామాల్లో కార్యకర్తలపై కొందరు బెదరింపులకు దిగుతున్నారని అలాంటి వారికి తగిన సమయంలో బుద్ధి చెబుతామన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీ.లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రవీందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కోడ్గల్ యాదయ్య, మార్కెట్ మిటీ మాజీ చైర్మన్ పురుషోత్తం, తహేర్, గందు చెన్నయ్య, గోపాల్ గౌడ్, సత్యం, సంతోష్‌రెడ్డి, గోపాల్, మక్సూద్, ఆశన్న, రాగుల వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు ఇంటర్ విద్యార్థులకు పర్యావరణ పరీక్ష

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పర్యావరణ విద్యపై అన్ని గ్రూప్‌ల ప్రైవేట్, ప్రభుత్వ గురుకుల, కేజీబీవీలలో చదివే విద్యార్థులకు గురువారం పరీక్ష నిర్వహించనున్నారు. ఈనెల 31న మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష, ఫిబ్రవరి 1న ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష ఉంటుంది. 20 మార్కుల ఈ పరీక్షో ఏడు మార్కులు వస్తేనే పాస్ అవుతుతారు. థియరీ 80 మార్కుల పేపర్ రాయాల్సి ఉంటుంది.

బేస్‌లైన్ టెస్టు వివరాలు అప్‌లోడ్ చేయాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నిర్వహించిన బైస్‌లైన్ పరీక్ష వివరాలను వెంటనే విద్యాశాఖ ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. పది విద్యార్థులకు ఈ ఏడాది నుంచి గ్రేడింగ్ విధానం తీసేసి మార్కుల విధానాన్ని ప్రవేశపెట్టినందున అన్ని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయ్యాలన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎం కవిత, ఆర్పీ లింగస్వామి, సీఆర్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

జడ్చర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికే క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. జడ్చర్ల మండలం కోడ్గల్ జడ్పీహెచ్ఎస్ ఆవరణలో బుధవారం బిగ్ హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొని, మాట్లాడారు. బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రథమ స్థానంలో, ఆలూరు జడ్పీహెచ్ఎస్, కోడ్గల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచాయి. సీఎంవో బాలుయాదవ్, ఎంఈవోలు మంజులాదేవి, సుధాకర్, బిగ్‌హెల్ప్ ప్రతినిధులు శంకరయ్య, శ్రీనివాస్‌శెట్టి, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటోకు నిప్పంటించిన దుండగులు



దగ్ధమైన ఆటో

మహబూబ్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఇంటిముందు పార్క్ చేసిన ఆటోను అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. పట్టణంలోని కుమ్మరివాడకు చెందిన వెంకటేష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగానే మంగళవారం రాత్రి ఇంటి ముందు ఆటోను పార్క్ చేశాడు. బుధవారం తెల్లవారుజామున నిద్రలేచి చూసేసరికి ఆటో పూర్తిగా దగ్ధమైంది. దీంతో పాటు పక్కనే ఉన్న ఇంటికి నిప్పు పెట్టగా తలుపులు పాక్షికంగా కాలిపోయాయి. ఇంటిముందున్న బోరు మోటార్‌ను కూడా తగలబెట్టారు. కక్షపూరితంగానే పెట్రోల్ పోసి ఆటోను తగలబెట్టారని రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



చెన్నయ్య (ఫైల్)

మూసాపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం రాచాల అనుబంధ గ్రామం నాగాయిపల్లిలో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. అడ్డాకుల ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గద్దెగూడెం చెన్నయ్య (24) తల్లితో కలిసి గ్రామంలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం ఇంట్లోనే నిద్రపోగా దూలానికి ఉరి వేసుకుని ఆత్మహ్యతకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం గమనించిన తల్లి స్థానికుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోళ్ల పరిశ్రమను తొలగించాలి



కోళ్ల పరిశ్రమ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్థులు

మూసాపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుంకినీపూర్ గ్రామ సమీపంలో ఉన్న మణి కోళ్ల పరిశ్రమతో దుర్వాసన వెదజల్లుతుందని, వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. పరిశ్రమను ఆవరించి ఉన్న పంట పొలాల్లో కొందరు యువకులు రాత్రి వేళ అడవి పందుల కాపలాకు వెళ్లారు. ఈ క్రమంలో బ్యాటరీ వెలుతురు తమ ఇళ్లపై పడిందని ఆగ్రహంతో పరిశ్రమ కూలీలు దాడి చేయగా, గ్రామానికి చెందిన ఉమ్మల మహేష్, రామేందర్, శివకుమార్ గాయపడ్డారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలు తమ యువకులపై దాడి చేయడం తగదని భైఠాయించారు. సమాచారం తెలుసుకున్న మూసాపేట, అడ్డాకుల ఎస్ఐలు శ్రీనివాస్, వేణు పరిశ్రమ వద్దకు చేరుకుని గ్రామస్థులతో మాట్లాడి ఆందోళన విరమించాలని సూచించారు. వీరిపై దాడికి పాల్పడిన పరిశ్రమ కూలీలు కుమార్, సునీల్‌పై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వేణు తెలిపారు.